ప్రజాశక్తి
ఆదివారం 26 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం

ఐదు ఇసుక రీచ్‌లకు అనుమతి

కలెక్టరేట్ : జిల్లాలో ఐదు ఇసుక రీచ్‌లను ప్రారంభించేందుకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ అనుమతించింది. కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం శనివారం జరిగింది. సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించి, ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టవచ్చని సమర్పించిన నివేదిక మేరకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. భామిని మండలం నులకజోడు ఇసుక రీచ్ 61,098 మెట్రిక్ టన్నులు, నేరెడి 66,912 మెట్రిక్ టన్నులు, లివిరి 61,860 మెట్రిక్ టన్నులు, తాలాడ 40,559 మెట్రిక్ టన్నులు, కొమరాడ మండలం కె.ఆర్.బి.పురం 15,561 మెట్రిక్ టన్నుల ఇసుక రీచ్ లను కమిటి ఆమోదించింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత అనే మాట తలెత్తరాదన్నారు. జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా ఇసుక రవాణా కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. సమావేశంలో ఎఎస్‌పి ఒ.దిలీప్‌కిరణ్, మైనింగ్ డిడి ఎం.బాలాజీ నాయక్, ఎడి ఎస్‌పి కె.మల్లేశ్వరరావు, డిపిఒ తదితరులు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకిలను ఎస్‌టిలో చేర్చొద్దు

బోయ, వాల్మీకిలను ఎస్‌టిలో చేర్చుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో గిరిజనులు నిరసనలు చేపట్టారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి పంపిన తీర్మానాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనులకు కేటాయించిన హక్కులు, చట్టాల పరిరక్షణకు ప్రతి గిరిజనుడు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ పిలుపునిచ్చారు. ఇందుకు నిరసనగా శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు తమ స్వార్ధ రాజకీయాల కోసం నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. బోయ, వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తే గిరిజనులకు ఉన్న కాస్త హక్కులు దూరమైపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.గిరిజనుల కోసం రూపొందించిన 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, జిఒ నెంబర్ 3, పిసా చట్టాల అమలుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకొని, వాటికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రాములమ్మకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్, యువజన సంఘం నాయకులు పువ్వల మోహన్‌రావు, గిరిజన నాయకులు సన్యాసిరావు, అడిత్, పాండురంగారావు, తదితరులు ఉన్నారు.

పాచిపెంట : బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాచిపెంటలో నిరసన తెలిపారు. గిరిజన సంఘం మండల అధ్యక్షులు సూకురు అప్పలస్వామి మాట్లాడుతూ 40 లక్షల మంది ఉన్న బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేరిస్తే ఇప్పటికే ఉన్న గిరిజన తెగలు తీవ్ర అన్యాయానికి గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు గిరిజన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ఈ విషయం పైన స్పష్టంగా గిరిజనులకు హామీ ఇవ్వాలని అన్నారు. డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర దీనిపై స్పందించాలని, గిరిజనుల పక్షాన నిలబడాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

గుమ్మలక్ష్మీపురంలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న గిరిజనులు

కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొర్ర శ్రీనివాసరావు, సొయారి లక్ష్మణరావు, పాంగి ఉమా, బోను శ్రీనివాసరావు, దేవుడు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతంపేట : బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంఘం కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేస్తూ బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బిడ్డిక అప్పారావు మాట్లాడుతూ గిరిజనులకు వ్యతిరేకంగా ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం వెనక్కి తీసుకొని రద్దు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు వీరికి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మద్దతు పలికారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు జె.శ్రీరాములు, భాస్కరరావు, సాంబయ్య, సర్పంచ్ సుందరమ్మ, ప్రసాద్ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : బోయ, వాల్మీకులను ఎస్టీలో చేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానించడం సమంజసం కాదని వెంటనే వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం .శ్రీనివాసరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్టీలో చేర్చే ప్రక్రియను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పువ్వల తిరుపతిరావు, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ

అసెంబ్లీ తీర్మానంపై పలుచోట్ల నిరసనలు

ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిల్లేడువలస, బొర్రా పనుకువలస గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయకుండా, అటవీ ప్రాంతంలో ఉన్న గనులను, భూములను కార్పొరేట్ శక్తులకు పంచి పెడుతూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ మండల కార్యదర్శి వంతల సుందర్రావు, నాయకులు సీదరపు మోహన్‌రావు, జి.వెంకటేష్, వంతల శివ, మెల్లిక కోమన్న, నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి తాడంగి గాసి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని ఎపి గిరిజన సంఘం నాయకులు ఖండించారు. మండలంలోని కూనేరు సంతలో గిరిజన సంఘం నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు లక్ష్మణరావు, సింధు, రాజు, వెంకటేష్, నవీన్, చింతామణి, వెంకటరావు, దుర్గారావు, జనార్ధన్ పాల్గొన్నారు.

సాలూరు: బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడానికి నిరసన శనివారం ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు, ఎస్ఎఫ్ఐ మద్దతు పలికాయి. గిరిజన సంఘం సభ్యులు పి.వరుణ్ ఆధ్వర్యాన గిరిజనులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదన ను విరమించుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, ఎస్ఎఫ్ఐ నాయకులు నితిన్ పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : బోయ, వాల్మీకిలను ఎస్‌టిలో చేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌కు వినతిని అందజేశారు.

సీతంపేటలో ర్యాలీ చేస్తున్న గిరిజ సంఘ నాయకులు, కొమరాడ, కురుపాంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు, నాయకులు

వర్చువల్ మీటింగ్‌ను వీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మహిళాసంఘాల సభ్యులు

మహిళలకు రూ.94.18 కోట్లు ఆసరా

ప్రజాశక్తి - కలెక్టరేట్

వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం కింద మూడవ విడతలో జిల్లాలో 16,646 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,83,077 మంది సభ్యులకు రూ.94.18 కోట్లు ఆసరా నిధులు జమయ్యాయి. వర్చువల్ విధానంలో జరిగిన వైఎస్ఆర్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే ఎ.జోగారావు పాల్గొన్నారు. అనంతరం మహిళా సంఘాలకు నమూనా చెక్కులను పంపిణీ చేశారు. ఆసరా పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభా రాణి, జెడ్పిటిసి బలగ రేవతమ్మ, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్, టి.పి.ఎం.యు ఎపిడి వై.సత్యం నాయుడు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : నవరత్నాల్లో భాగంగా జగనన్న ప్రభుత్వం మహిళలకు ఊరట కల్పించే మహోన్నత పథకం ఈ ఆసరా పథకం అని, పాదయాత్రలో భాగంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి చేసే ప్రయత్నమని ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌బికెలో ఏర్పాటు చేసిన జగనన్న ఆసరా విడుదల టెలికాన్ఫరెన్స్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మండలంలోని 1311 గ్రూపుల్లో గల 14,758 మంది మహిళలకు రూ.7 కోట్ల 58 లక్షల జగనన్న ఆసరా పథకం ద్వారా మహిళల ఖాతాల్లోకి విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు రాగలత, ఎంపిడిఒ భానుమూర్తి, ఎపిఎం కె.ఉమామహేశ్వరరావు, సిసి మురళి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: :ప్రతి మహిళా స్వయం పురోగతి సాధించాలని నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు అన్నారు. వైఎస్ఆర్ ఆసరా 3వ విడత ప్రారంభ కార్యక్రమం స్థానికనగర పంచాయతీ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నగర పంచాయితీ చైర్ పర్సన్ యందవ రాధాకుమారి, మెప్మా సిఎంఎం శారదావాణి, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని 5,753 స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.4,46,31,954 అకౌంట్లలో జమవుతాయన్నారు.

గుమ్మలక్ష్మీపురం : 3వ విడత వైయస్సార్ ఆసరా కార్యక్రమం విడుదల చేస్తున్న నేపథ్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో టీవీల్లో వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి దీనమయ్య, జెడ్‌పిటి రాధిక, వైస్ ఎంపిపిలు లక్ష్మణరావు, శేఖర్, ఎంపిడిఒ సాల్మన్ రాజు, ఐకెపి ఎపిఎం ఆదయ్య, తదితరులు పాల్గొన్నారు.

28, 31న వైఎస్ఆర్ ఆసరా

పార్వతీపురం టౌన్ : వైఎస్ఆర్ ఆసరా మూడో విడత విడుదలయ్యాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు తో పాటు వైసిపి కౌన్సిల్ సభ్యులు పాల్గొన్న కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 28 పార్వతీపురం రూరల్, 31న మున్సిపాల్టీ పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్‌చైర్మన్ ఇండుపూరు గున్నేశ్వర రావు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు కోరాడ శ్రీనివాసరావు (నాని), పి జయంతి, ఎస్.లావణ్య, చీకటి అనురాధ, మజ్జి శశికర్, కో-ఆప్షన్ సభ్యులు మెరువ వెంకట్రావు, వైసీపీ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, మజ్జి శేఖర్, మెప్మా సిఎంఎం లు, ఆర్‌పిలు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమాలు

చనిపోయిన వారి పేరున మస్తర్లు • కానరాని జీడి మొక్కలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఉపాధిహామీ చట్టం కింద చేపట్టిన పనుల్లో పలు అవకతవకలు బయటపడ్డాయి. 2020-21 ఏడాదికి సంబంధించి ఉపాధిహామీ నిధులు రూ.13 కోట్ల 61 లక్షలతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో ఆత్మల పేరిట మస్తర్లు వేయడం, జీడి మొక్కలు మాయమైపోవడం వంటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద శనివారం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు సమక్షంలో ప్రజా వేదికలో తనిఖీ బృందాలు పలు అభ్యంతరాలు నివేదించాయి. ఈ నివేదికలో వెలుగులోకి వచ్చిన పలు అక్రమాలు ముఖ్యంగా చనిపోయిన వారి పేరిట మస్తర్లు వేసి బిల్లులు స్వాహా చేశారు. మండలంలో ఏజెన్సీ పంచాయతీలైన మూటకూడు, తంగలం, గరిసి గుడ్డి, సదాభి పంచాయతీల్లో గల పలు గ్రామాల్లో చనిపోయిన వారి పేరుట బిల్లులను సాగర్ సంజీవరావు, సాగర్ రామయ్య, చిన్నమ్మి, సేబి లచ్చయ్య, కర్ణాల గంగయ్య పలువురు ఆత్మల పేరిట మస్తర్లు వేసి బిల్లులు స్వాహా చేసినట్లు నివేదికలో వెల్లడయ్యాయి. 70 మంది గిరి రైతులకు రూ.10లక్షలు విలువ చేసే జీడిమొక్కలు మాయమైనట్లు తనిఖీ బృందాలు నివేదికలో వెల్లడించాయి. మళ్లీ మొక్కలు నాటే బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందేనని పిడి రామచంద్ర ఆదేశించారు. సతాబి పంచాయతీలో పాస్‌ఆర్డర్ లేకుండా రూ.లక్షా13 వేలు చెల్లించినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. మంచాడవలస సర్పంచ్ సిహెచ్ సావిత్రి తమ గ్రామానికి గత రెండేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్ లేరని, నియామకం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, ఎపిడి శ్రీహరి, ఎపిఒ మహేష్, పలువురు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరుతున్న మంచాడవలస సర్పంచ్ సావిత్రమ్మ

ఎస్‌టిలో చేర్చడం రాజ్యాంగ విరుద్ధం

కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మాజీ మంత్రి కిశోర్‌చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం

బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితా లోకి చేర్చేందుకు చేపట్టిన అసెంబ్లీ తీర్మానం పూర్తి రాజ్యాంగ విరుద్ధమని, 40లక్షల మందికి మోసపూరిత హామీ అని కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల. కిషోర్ చంద్ర దేవ్ అన్నారు. శనివారం ఆయన నివాసంలో మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజనేతరులుగా ఉన్న బోయ, వాల్మీకిలను ఎస్టీలుగా మార్చుతామనడమే సాధ్యం కాదని అన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, సమగ్రమైన ఆధారాలతో వెనుకబాటుతనం ధ్రువీకరణ చేసి రాష్ట్ర పరిపాలన యంత్రాంగ వ్యవస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అర్జీ పెట్టిన తర్వాత అక్కడ ఎన్‌సి, ఎస్టీ దర్యాప్తు అనంతరం ఆమోదించబడితే అప్పుడు దానికి గెజిట్ కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తేనే ఎస్‌టి జాబితాలోకి వస్తోందనీ, లేకపోతే ఉండదని అన్నారు. 1991-96లో చంద్ర శేఖర్ ప్రధానిగా ఉన్న సమయంలో అస్సాంలో ఓ తెగను ఎస్టీలో చేర్చే ప్రయత్నం చేస్తే పార్లమెంట్‌లో తిరస్కరించారని గుర్తు చేశారు. అలాగే రాజస్థాన్‌లో మీనా ,బెల్ వంటి అభివృద్ధి చెందిన కులాలు చేర్చిన కారణంగా ముందు నుంచి ఎస్టీలో ఉన్న కులాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. తెలంగాణలో నాయక్ ల అభివృద్ధి మిగిలిన కులాలకు లేదని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా గిరిజన తెగలకు రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన హక్కులు కాలరాస్తూ ,అటవీ హక్కులు చట్టం, పీసా చట్టం, ఇతర ఆదివాసీ చట్టాలు నిర్వీర్యం చేస్తూ ఆదానీ ,అంబానీ లకు గిరిజన సామాజిక సంపద కట్టబెడుతుందని విమర్శించారు. ఈ మోసపూరిత హామీ కారణంగా గిరిజన తెగలు మరింత వెనక్కి నెట్టబడతారని, కులాలు, ,ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టినట్లేనని అన్నారు. హామీ ఇచ్చేముందు సమగ్రమైన అవగాహన , సాధ్యాసాధ్యాలు తెలుసుకోవాలని లేదంటే సిపిఎస్ రద్దు హామీ లాగానే చరిత్రలో నిలిచి పోతుందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తెరిగి హామీ ఇవ్వాలని సూచించారు.

అదానీ అంబానీలకు ప్రాజెక్టులు ధారాదత్తం చేస్తున్న ముఖ్యమంత్రి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనను రక్షించుకునేందుకే మాత్రమే రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులను అదానీ ,అంబానీ లకు కట్టబెడుతున్నారన్నారు. విశాఖ స్టీల్‌కు తన అవసరాలకు మినహా ఉన్న ఉమ్మడి ఆస్తి 9 వేల ఎకరాల భూమి రియల్‌స్టేట్ వ్యాపారం చేసేందుకు చేపడుతున్న కుట్రకు ఉత్తరాంధ్ర ప్రజలు సరైన జవాబు చెపుతారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అదానీ పవర్ ప్రాజెక్టుల నిర్మాణం ఆదివాసీ హక్కులు కాలరాయటమే అన్నారు. వీటన్నింటిపై ఐక్య పోరాటం చేయకపోతే భవిష్యత్ గిరిజన తరానికి తీవ్ర ముప్పు అని అన్నారు.

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎండిఎం కార్మికులకు వేతనం పెంచాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో పనిచేస్తున్న మధ్యాహ్నం భోజనం కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డిఇఒ కార్యాలయం ఎదుట మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు జి.తులసి, వి.ఇందిర మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలు విస్మరించాయని, దశాబ్దాలుగా పనిచేస్తున్నప్పటికీ కార్మికులకు జీతాలు పెంచడం లేదని, గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, నిత్యం పాఠశాలలో వంట చేసే కార్మికులకు అగ్ని ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం నేటికీ మధ్యాహ్నం భోజనం కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం లేదని అన్నారు. ప్రస్తుత నిత్యావసర వస్తువుల మార్కెట్ ధరలకు అనుకూలంగా మెనూఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. భోజన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ సదుపాయం కల్పించాలని, సబ్సిడీ వంట గ్యాస్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిఇఒ కార్యాలయంలోని సూపరింటెండె ంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం కార్మికుల యూనియన్ నాయకులు పావని, లక్ష్మి ,నరసమ్మ, అప్పయ్యమ్మ, నారాయణమ్మ, అన్నపూర్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి జి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మెగా కిసాన్ మేళాకు కొందరికే ఆహ్వానమా?

కెవికె సిబ్బందిపై ప్రజాప్రతినిధుల నిరసన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని రస్తాకుంటుబాయిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతులతో మెగా కిసాన్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు రాష్ట్ర, జిల్లా అధికారులు హాజరయ్యారు. అంతవరకు బాగానే ఉన్నా స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధుల్లో కొంతమందికి ఆహ్వానం ఇచ్చి మరికొంతమందికి ఆహ్వానం ఇవ్వకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు విపిసిస్తున్నాయి. వారేమీ ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధులా అనుకుంటే అది కూడా కాదు. వారంతా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులే. ఇంత పెద్ద మేళా నిర్వహిస్తున్నప్పటికీ వారికి సమాచారం ఇవ్వకపోవడంపై ఆ ప్రజా ప్రతినిధులకు అర్థం కావడం లేదట. కెవికె నిధులు గిరిజన రైతులకు అందాల్సిన స్థాయిలో అందకుండా పక్కదారిపడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మేళాకు ఒకవేళ ఈ ప్రజా ప్రతినిధులు హాజరైతే అవి బయటకు తీస్తారేమోనని భయపడుతున్నారా అని పలువురు ప్రజా ప్రతినిధులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయ సాంకేతిక రంగాల్లో కెవికె ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందించాల్సిన నూతన వ్యవసాయ పద్ధతులు, సేవలైతే సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక గిరిజన రైతులకు కూడా మేళా గురించి సమగ్ర సమాచారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కెవికె సేవలు కేవలం డెమో క్లాసులకే తప్ప రైతులకు గ్రామస్థాయిలో అందాల్సిన సేవలు, సబ్సిడీలు సక్రమంగా అందడం లేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన రైతులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకే సమగ్ర సమాచారం ఇవ్వనప్పుడు మాలాంటి రైతులకు ఎలా సేవలందిస్తారని అనుకుంటామని విమర్శిస్తున్నారు. కెవికె సేవలు తమకు అందనంత దూరంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కెవికె సేవలు రైతులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

హామీల అమలు కోరితే అరెస్టులా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'రాజకీయాల్లో విశ్వసనీయత, పాలనలో పారదర్శకత, నీతి నిజాయితీ అంటూ వల్లె వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరితే మీనమేషాలు లెక్కిస్తోంది. కాదు.. కాదు... నిరసనలు తెలియజేసిన వారిపై నిర్బంధాలు, అరెస్టులకు పాల్పడుతోంది'. ఇదీ ఈ వారం పబ్లిక్ టాక్. కేవలం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వారి కుటుంబీకుల్లోనే కాదు, యావత్తు స్కీమ్ వర్కర్లు, ఉద్యోగులు, కార్మికులు, వారికి నాయకత్వం వహిస్తున్న సంఘాలు, ప్రజాస్వామ్యవాదుల్లో ముమ్మరంగా సాగుతున్న చర్చ. ఇందుకు కారణం లేకపోలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరంచడంతోపాటు వాటిలో కార్యకర్తలు, ఆయాలకు మెరుగైన వేతనాలు కల్పించడంతోపాటు ఉద్యోగ, భద్రత, టిఎ, డిఎలు, సకాలంలో బిల్లులు చెల్లిస్తానని 2019 ఎన్నికలకు ముందుకు రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా హామీలు గుప్పించిన విషయం విధితమే. వాటి అమలు తీరు చూస్తుంటే నేతి బీరకాయలో నెయ్యి వెతికిన చందంగానే ఉంది. ఇప్పటికే నాలుగేళ్లు గడిచిపోయాయి. పలు దఫాలుగా ఎన్నో రూపాల్లో

అంగన్‌వాడీలు, స్కీం వర్కర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినా అమలు కాకపోవడంతో ఈనెల 20న అంగన్‌వాడీలు చలో విజయవాడ కార్యక్రమాన్నితలపెట్టిన విషయం విధితమే. ఈనేపథ్యంలో యూనియన్ నాయకులతో చర్చలు జరిపి, సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాల్సిన ప్రభుత్వం పోలిసులను ఉసుగొల్పింది. పోలీసులు మరింత అత్యుత్యాహ్సం ప్రదర్శిస్తూ చలో అసెంబ్లీకి ముందు రోజు ఆదివారమే విజయవాడకు ప్రయాణమవుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలతోపాటు వారికి తొలి నుంచీ అండగా నిలుస్తున్న సిఐటియు నాయకులను ఇటు విజయనగరం, అటు పార్వతీపురం మన్యం జిల్లాల్లో సుమారు 100మందికిపైగా ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. విజయనగరంలో సంతకాల వంతెనవద్ద, బొబ్బిలి, డొంకినవలస, గజపతినగరం, పార్వతీపురం స్టేషన్లలో ఎక్కకడికక్కడ దొరికినవారిని దొరికినట్టు నిర్బంధించి, పోలీసులు తమ వాహనాల్లో బలవంతంగా తరలించారు. మరికొందర్ని ఇళ్ల వద్దే నిర్బంధించారు. స్టేషన్లకు తరలించినవారిని రాత్రి వరకూ అక్కడే ఉంచారు. ఈ చర్యలు అత్యంత హేయమైనవని, ప్రజాస్వామ్యం కల్పించిన హక్కులను కాలరాయడమేనని ప్రజాసంఘాల నాయకులు వ్యాఖ్యానించారు. ఓవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు మట్టికరిపిస్తున్నా ప్రభుత్వానికి బుద్ధిరావడం లేదని మరికొంతమంది విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నిర్బంధాలు, అరెస్టులకు పాల్పడినంత మాత్రాన అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనలు ఆగలేదు. చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసినందుకు నిరసనగా మరుచటి రోజు ఉదయాన్ని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన కార్యకర్తలు ఆయా కలెక్టరేట్లకు చేరుకొని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకత్వంలో ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ప్రజా, కార్మిక, ఉద్యోగ ఉద్యమాలను అణిచివేత చర్యలతో ఆపలేమన్న విషయం ప్రభుత్వం గుర్తించాలని, లేదంటే మునుపటి ప్రభుత్వాల మాదిరిగా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జనం చర్చించుకుంటున్నారు.

విధుల నుంచి ఇద్దరు అధ్యాపకులు బహిష్కరణ

ప్రజాశక్తి - కురుపాం

ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణలో మద్యం సేవించి ఇన్విజిలేటర్ విధులకు హాజరయ్యారనే విషయంపై స్పందించిన ఇంటర్మీడియట్ బోర్డు సంబంధిత అధ్యాపకులను విధుల నుంచి బహిష్కరిస్తూ ఈనెల 23న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయం రెండు రోజుల ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించిన వివరాల్లోనికి వెళ్తే ఈనెల 20న పరీక్షలు నిర్వహణను పరిశీలించేందుకు వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ రూం నంబర్ 7,9ను తనిఖీ చేసింది. అనంతరం ఇన్విజిలేటర్లు మద్యం సేవించి విధులకు హాజరయ్యారని, అలాగే వివరణ కోరిన ఫ్లయింగ్ స్క్వాడ్‌పై వాదనకు దిగారు. వీరి కారణంగా పరీక్ష కేంద్రం వాతావరణం దెబ్బతిందని ఫ్లయింగ్ స్క్వాడ్ నివేదిక ప్రిన్సిపల్‌కు, ఆర్‌ఐఒకు పంపారు. ఈ మేరకు డివిఇఒ సమగ్రమైన దర్యాప్తు చేయాలని ఆర్‌జెడి ఆదేశించారు. ఈనెల 21న దర్యాప్తు అనంతరం నివేదికపై సీరియస్‌గా తీసుకున్న ఇంటర్మీడియట్ ఆర్జేడీ స్థానిక జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కామర్స్, హిందీ లెక్చరర్లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఆదేశించారు. ఈ ఉత్తర్వులు సోషల్ మీడియాలో హల్చల్ చేయడంతో విషయం బయట పడింది.

ప్రజాశక్తి
www.prajasakti.com

రీ సర్వే పక్కాగా జరగాలి : జెసి

కలెక్టరేట్ : భూముల రీసర్వే పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. రీ సర్వేకు సంబంధించి ప్రతి మండలానికి, గ్రామానికి ప్రత్యేకంగా నియమించిన సర్వేయర్లు, రెవిన్యూ అధికారులతో శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రస్తుతం తయారు చేసిన సర్వే రికార్డులో రాసున్న తరుంకు ప్రామాణికమని తెలిపారు. పక్కాగా సర్వే నిర్వహించి సాగుదారు రైతులకు తప్పులేని భూ హక్కు పత్రాలను అందించాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో భూమిపై సాగులో ఉన్నవారి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మ్యుటేషన్స్, భూ పంపకాలు మొదలైనవి పూర్తిస్తే పని సులభతరమవుతుందని తెలిపారు. మ్యుటేషన్స్ విషయంలో వేగవంతం ఉండాలని చెప్పారు. భూ రికార్డుల తయారీ, మ్యుటేషన్ విషయంలో వీఆర్ఒలు అలసత్వం వహిస్తే వారిపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. మ్యుటేషన్ల జారీలో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించడం జరిగిందని, అయినప్పటికీ కొన్ని మండలాల్లో మ్యుటేషన్ల జారీలో జాప్యం జరుగుతోందని అన్నారు. ఇకపై ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డిఒ కె.హేమలత, ఆర్ఐలు, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సవరకోటపాడులో పనులను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

అభివృద్ధి పనుల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేటలో మైక్రో వాటర్ షెడ్ లోని సవరకోటపాడు ఉద్యానవన కేంద్రంలో జరుగుతున్న పనులను ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ శనివారం పరిశీలించారు. అమృత సరోవర్, పెరకొలేషన్ ట్యాంక్, మెషిన్ ఫార్వాండ్, చిన్న ఊట కుంటలు పరిశీలించారు. జెకె పాడులో ఎంట్రీ పాయింట్ ఆక్టివిటీ భాగం రాల్ వాటర్ ట్యాంక్ పరిశీలించారు. గిరిజన రైతులకు అందించే వ్యవసాయ పనిముట్లు లబ్ధిదారుల ఎంపిక ఏ విధంగా జరుగుతుంది అని దానిపై ఆరా తీశారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం జిసిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్‌ను పరిశీలించారు. అమ్మకాలు, కొనుగోలు చేపడుతున్న నిత్యవసర సరుకులు, అటవీ ఉత్పత్తుల వివరాలను జిసిసి మేనేజర్ కృష్ణప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఇఇ శాంతీశ్వరరావు, వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ అధికారి రెడ్డి పోలి నాయుడు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి

పార్వతీపురం టౌన్ : ఫ్లైఓవర్ పై ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రదేశాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆర్‌అండ్‌బి అధికారులు ఫ్లైఓవర్ వంతెన రహదారిపై గల గుంతల మరమ్మతులు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ వంతెన మూడు వైపుల గల రహదారుల్లో ఏటువంటి గుంతలు లేకుండా పనులు పూర్తి చేయాలని, అలాగే ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్ పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఐ.గున్నేశ్వరరావు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, ఆర్‌అండ్‌బి ఇఇ, డిఇ, వార్డు కౌన్సిలర్ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి : డిడి

మక్కువ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార మెనూను హాస్టల్ విద్యార్థులకు సక్రమంగా అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సూర్యనారాయణ ఆదేశించారు. మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన పథకం, ఇతర మెనూను అడిగి తెలుసుకున్నారు. టెన్త్ పరీక్షలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ సాల్మన్‌రాజు ఉన్నారు.

డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టొద్దు

వీరఘట్టం : ఆటో ముందు భాగంలో ప్రయాణికులను ఎక్కించరాదని డిఎస్‌పి జివి కృష్ణారావు వాహనదారులను హెచ్చరించారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వాహనదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అధిక లోడులతో వాహనాన్ని నడపరాదని, అతివేగం ప్రమాదకరమని, నిదానమే ప్రధాన మనీ సూత్రలు పాటించి వాహనాలు నడపాలన్నారు. గుట్కాలు, మద్యం సేవించి వాహనాలు నడిపితే శాఖాపరమైన చర్యలతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐ ఎం.మురళీధర్, ఇన్చార్జి ఎస్సై కిషోర్ వర్మ, సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

వాహనాలు వేలం

వీరఘట్టం : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో శనివారం పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో సారాతో పట్టుబడిన వాహనాలకు సంబంధించి రూ.56,994 వచ్చినట్లు ఇన్చార్జి ఎస్సై కిషోర్‌వర్మ తెలిపారు. ఒక ఆటో, మూడు ద్విచక్ర వాహనాలకు సంబంధించి సర్కార్ పాట రూ.47 వేలు అదనంగా వచ్చింది. కార్యక్రమంలో సిఐ ఎం.మురళీధర్, వేలంపాటదారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

సీతానగరం : గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమని మండలంలోని కొత్తవలస సర్పంచ్ రెడ్డి అనిత అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రత వాతావరణం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారని తొలగించి, దోమల మందు స్ప్రే చేయిస్తున్నట్టు తెలిపారు. మంచినీటి ట్యాంకులు శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ చల్లించడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో ఆశా వర్కర్, గ్రీన్ అంబాసిడర్లు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పెదపెంకిలో ఉచిత వైద్యశిబిరం

బలిజిపేట: మండలంలోని పెదపెంకికి సమీపంలో గల శిలువ గిరి పుణ్య క్షేత్రం వద్ద నెల్లిమర్ల మిమ్స్ వైద్య బృందం స్వచ్ఛంద సేవకులు నగిరి రాము సమక్షంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం శస్త్ర చికిత్సలకు ఎంపికైన రోగులకు సోమవారం తమ సొంత వాహనాల్లో నెలిమర్ల తీసుకువెళ్తామని వైద్య బృందం తెలిపింది. కార్యక్రమంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు సంజీవ నాయుడు, యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని స్థానిక భవనంలో కరపత్రం విడుదల చేశారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్ల వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులు, రైతులు కష్టజీవులు ప్రజలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీలో భారీ ప్రదర్శన పోరాటంలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటరమణ, రాము, నాగరాజు, సునీల తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరురతూ మండలం మామిడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేస్తుందని, కనీస వేతనాలు కూడా ఇవ్వటం లేదని ఈసమస్యలపై పోరాడేందుకు ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ధర్నాకు అన్ని ప్రజా సంఘాలు కదలి రావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు జానకి, గంగమ్మ, నారాయణమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు

సీతంపేట : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో వివిధ సంఘాల సమావేశం అనంతరం కరపత్ర ఆవిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.అప్పలస్వామి, ఎస్.లక్ష్మి, జి.ప్రసాదు, భామిని, సీతంపేట మండలాల నాయకులు ఎన్.రోయ్‌భారి, ఎస్.సురేష్, కె.ఉష, బి.పద్మ, జి.జగన్ నాయకులు పాల్గొన్నారు.

సాలూరు :చలో ఢిల్లీ కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

సాలూరు : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరుగనున్న ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు పట్టణ నాయకులు టి.రాము, టి.శంకర్ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

సీతానగరం : ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి.ఈశ్వరరావు కోరారు. మండలంలోని వెంకటాపురం, నీలకంఠాపురం గ్రామాల్లో ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సియిటియు నాయకులు జి.వెంకటరమణ, వ్యవసాయ సంఘం నాయకులు చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు

మహిళా అధికారులను సన్మానిస్తున్న జెసి ఆనంద్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గత పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న వేడుకల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు విద్య, వైద్య, శిశు సంక్షేమ శాఖల నుంచి ప్రతిభ కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయంగా రాణిస్తున్నారన్నారు. కొత్తగా ఏర్పడిన మన జిల్లాలో విద్య, వైద్యం, శిశు సంక్షేమ రంగాల్లో మహిళలు ఉద్యోగులున్నారని, జిల్లాకు మంచి పేరు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ఎ మహిళల భద్రతపై ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొన్న, వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు పురస్కారాలను అందజేశారు. ముగుంపు కార్యక్రమానికి ఆర్‌డిఒ కె.హేమలత, ఐసిడిఎస్ పిడి విజయగౌరి, డిఇఒ ఎస్‌డివి రమణ, డిఎంహెచ్ఒ బి.జగన్నాధరావు, క్రీడా సాధికారత అధికారి కె.రామ్‌గోపాల్, క్రీడా శాఖ జిల్లా అధికారి ఎస్.వెంకటేశ్వరావు, సిపిఒ వీర్రాజు, క్రీడా సాధికారత కో ఆర్డినేటర్ గాంధీ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చిరుధాన్యాలు మేలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆరోగ్యానికి చిరుధాన్యాలు అవసరం ఉందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. చిరుధాన్యాల్లో మానవ ఆరోగ్యానికి అవసరమైనకాల్షియం, ఇనుము, మెగ్నీషియం, భాస్వరం అనే ఖనిజాలు ఎక్కువ మొత్తంలో ఉంటాయని పేర్కొన్నారు. చిరుధాన్యాలపై వివిధ శాఖల అధికారులతో శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాల్లో కొవ్వు తక్కువ శాతంలో ఉండడం వల్ల రక్తంలో కొవ్వు శాతాన్ని తగ్గిస్తుందన్నారు. రక్తపోటుతో బాధపడేవారికి ఇవి మంచి ఆహారంగా ఉపయోగపడతాయని, చిరుధాన్యాలపై పొరల్లో ఉన్న ఖనిజాలు ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, మానవ ఆరోగ్యం అనే విషయం పైన వ్యాసరచన పోటీలు మండలాల స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. చిరుధాన్యాల ఆహార పదార్థాలను స్టాళ్లలో అమ్మకానికి, ప్రదర్శనకు పెట్టేలా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలని, మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, డిఇఒ ఎస్.డి.వి రమణ, టి.పి.ఎం.యు ఏపిడి వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు

ప్రాధాన్యత పనులపై సమీక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఎంపిడిఒ సాల్మన్ రాజు అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు, పనుల పురోగతి, పూర్తయిన పనులను ఆన్లైన్లో నమోదు తదితర వివరాలను సమీక్షించారు. మండలంలో పూర్తయిన పనులను ఆన్లైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ప్రవీణ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు హాజరయ్యారు.

పోషకాల ప్రాధాన్యతపై అవగాహన

ప్రజాశక్తి - భామిని

పక్వడా ద్వారా చిరుధాన్యాల ద్వారా లభించే పోషకాలు, పోషకాహర ప్రాధాన్యత, సరైన ఆహార పద్ధతులు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పిల్లల తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించే బాధ్యత అంగన్వాడీ నిర్వాహకులపై ఉందని ఎసిడిపిఒ విమల కుమారి అన్నారు. మండలంలోని అంగన్వాడీ సిబ్బందితో 15 రోజులు అంగన్వాడీల్లో నిర్వహిస్తున్న పోషన్ పక్వడా కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలు శారీరిక, మానసిక ఎదుగుదల్లో పోషకాల ఆవశ్యకత, చిరుధాన్యాల్లో లభించే పోషకాలు, పిల్లల్లో వయసుకు తగ్గ బరువు, సాధారణంగా మనకు లభించే చిరుధాన్యాలైన మినుములు, పెసల్లో ఉండే పోషకాలు, వాటి ద్వారా చేయగలిగే వివిధ వంటకాలు, ఆరోగ్యాకరమైన ఆహారపు తయారీ విధానాలు, స్థానిక వైద్యులు, అధ్యాపకులచే పోషకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిసి ఎ.లత, సూపర్ వైజర్ గౌహ్యా బేగం, ఆక్టివ్ సూపర్ వైజర్ సబితా పట్నాయక్, ఎపిఎం దొడ్ల భవాని ఉన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎసిడిపిఒ విమలకుమారి

డంపింగ్ యార్డ్‌లో మంటలు రాకుండా చూడాలి

పార్వతీపురంటౌన్ : పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌లో మంటలు పుట్టకుండా ఒకరిని కాపలా పెట్టాలని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.మురళికి సూచించారు. శనివారం ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో డంపింగ్‌యార్డ్‌లో ఎవరో ఆకతాయిలు మంటలు పెట్టడం జరుగుతుందని, దీనివల్ల ప్లాస్టిక్ వ్యర్థాలు కాలి మూడు, నాలుగు రోజుల వరకు మంటలు ఆరకపోవడంతో మంటల ద్వారా వ్యాప్తి చెందే పొగతో పరిసర ప్రాంతాల ప్రజలు, ఆ రహదారిపై రాకపోగా సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మంటలను ఆర్పేందుకు ఇటు మునిసిపల్ ప్రజారోగ్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారని, రానున్న వేసవి దృష్ట్యా అలాంటి పరిస్థితి పునరావృతం అవ్వకుండా ఒక మనిషిని యార్డ్ వద్ద కాపలా పెట్టాలని అన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బంటు పార్థచందన జిల్లా స్థాయిలో జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షలో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ 9వ తరగతిలో చేరడానికి పరీక్షలో ఉత్తర్ణత సాధించడంతో అర్హత సాధించిందన్నారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థినికి అభినందించినట్లు తెలిపారు.

ఆలయానికి నష్టం జరిగితే ఊరుకోం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కోటుపాంకాలనీ కొండపై ఉన్న శ్రీ సత్య నారాయణ స్వామి ఆలయానికి నష్టం జరిగితే చూస్తూ ఊరుకోమని ఆ గ్రామస్తులు అన్నారు. మండలంలోని కోటిపాం కాలనీ వద్ద ఉన్న శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయానికి రైల్వే మూడో లైన్ పనుల్లో భాగంగా కొండ దగ్గర బాంబులు బ్లాస్టింగ్ పనులను గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండభాగంలో బ్లాస్టింగ్లు చేయడంతో ఆలయం పగుళ్ల వచ్చాయని తెలిపారు. మూడో లైన్ పనుల్లో భాగంగా కొండను దొలిచివేయడంతో ఆలయం పడిపోయేందుకు అవకాశాలు ఎక్కువ ఉన్నాయన్నారు. కావున ఆలయానికి ఎటువంటి నష్టం జరగకుండా రైల్వే పనులు చేపట్టాలని, ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ చేస్తే అడ్డుకుంటామని అన్నారు.

పనులను అడ్డుకున్న గ్రామస్తులు

ఉపాధికల్పన కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఉపాధికల్పన కార్యాలయం ఏర్పాటు చేయాలని మన్యం జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ మన్యం జిల్లా ఏర్పాటై జిల్లా ఎంప్లాయిమెంటు కార్యాలయం ఏర్పాటు కాలేదని అన్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులు నేటికీ ఉపాధి కల్పన నమోదుకు విజయనగరం వెళ్లాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, ఎంప్లాయిమెంటు కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సజావుగా సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండల సర్వసభ్య సమావేశం శనివారం సజావుగా కొనసాగింది. గతంలో జరిగిన రెండు సర్వసభ్య సమావేశాలకు సభ్యులు హాజరు కాకపోవడం, ఒకవేళ హాజరైనా సంతకాలతో సరిపెట్టు కొని వెళ్లిపోవడం జరిగింది. అయితే శనివారం జరిగిన సమావేశంలో సభ్యులు సజావుగా కొనసాగించడం చర్చనీయాంశంగా మారింది. ఎంపిపి బొంగు సురేష్ వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకోవడంతో సమావేశం సజావుగా కొనసాగదనే ఊహాగానాలు వచ్చాయి. ఇరు వర్గాల వారు ఎటువంటి వాదనలకు దిగకుండా మండల అభివృద్ధికి పాటు పడేలా చర్చలు కొనసాగించారు. వ్యవసాయ శాఖ ఇంచార్జ్ అధికారిని విజయభారతి మాట్లాడుతూ మండలంలో రైతుల నుంచి 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, రైతులకు చెల్లింపులు కూడా పూర్తి చేశామని అన్నారు. హెచ్‌డిటి మాట్లాడుతూ ఐదు గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మిగతా గ్రామాల్లో చేపట్టాల్సి ఉందని అన్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్వోల ఖాళీలు ఉన్నాయని, ఇన్‌ఛార్జుల వల్ల కొన్ని పంచాయతీలు సజావుగా కొనసాగడం లేదని సభ్యులు ఆరోపించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం నుంచి భరత్ చంద్ర మాట్లాడుతూ జలజీవన్ మిషన్లో 89 పనులకు రూ.19.43 కోట్లు నిధులు మంజూరు కాగా, కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు కొనసాగడం లేదని టెండర్ల పూర్తి అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. హౌసింగ్ ఎఇ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 813మంది లబ్ధిదారులకు బిల్లులు ఇచ్చామని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు గ్రామాల్లో వివిధ పనులు చేపట్టేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శశికళ, వైస్ ఎంపిపి గుడివాడ సంపత్ కుమార్, ఎంపిడిఒ ఎస్.రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ హెల్పర్లు, మినీ అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. మండలంలో నాలుగు అంగన్వాడీ హెల్పర్లు, మూడు మినీ అంగన్వాడీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మోదుగ, మూటకూడు, మిలియాకంచూరు, విశ్వనాధపురం, మోదుగ పంచాయతీ లోవవలస, కొటికి పెంట పంచాయతీ వలసిలమడ, బొర్ర మామిడి పంచాయితీ రావివలసలో మినీ అంగన్వాడి కార్యకర్తల పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. దరఖాస్తుదారులు పదో తరగతి పాస్ అయి ఉండాలని, ఈనెల 28న సాయంత్రంలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్:

మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు శనివారం సందర్శించారు. సిబ్బంది హాజరుతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని, వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేల చూడాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

వెంకటాపురంలో ఫ్యామిలీ డాక్టర్

సీతానగరం : మండలంలోని వెంకటాపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ పి.ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి వయోవృద్ధులు, గర్భిణీలు, షుగర్, బిపి, ఆస్తమా ఫిట్స్ మొదలగు వ్యాధులతో బాధపడుతున్న వారు వచ్చారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులు ఇస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరికి మహేశ్వరరావు, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు సిమెంట్ బస్తాలు వితరణ

బలిజిపేట : మండలంలోని అరసాడకు చెందిన పూసర్ల నారాయణమ్మ అనే నిరుపేద మహిళకు పెదపెంకికి చెందిన రౌతు మురళి రెండు సిమెంట్ బస్తాలు, నేతాజీ గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు రెండు సిమెంట్ బస్తాలు అందజేశారు. నేతాజీ గ్రంథాలయం తరుపున ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గంటుపల్లి సతీష్, శ్రావణ్ కుమార్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కింగ్ ప్రకారమే రహదారి విస్తరణ పనులు

కురుపాం : కురుపాంలో మార్కింగ్ ప్రకారమే రహదారి విస్తరణ పనులు చేపడుతున్నట్లు ఆర్ అండ్‌బి డిఇ నాగమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి కురుపాంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని, ఇచ్చిన మార్కింగ్ ప్రకారం ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు పనులు చేపడతామని తెలిపారు. మంగళవారం లోగా ఇచ్చిన కొలతల మేరకు షాపులు, భవనాలు తొలగించాలని, లేకుంటే తామే తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఇ నిర్మల పాల్గొన్నారు.

పందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలస సమీపంలో శనివారం గొర్రె పందాలాడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు ఇన్‌ఛార్జి ఎస్ఐ కిశోర్‌వర్మ తెలిపారు. ఈ దాడుల్లో రెండు గొర్రెపోతులతో పాటు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి రూ.6,200 నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

రాణికి సేవారత్న పురస్కారం

ప్రజాశక్తి - పాలకొండ

ఆరోగ్య శాఖలో అత్యుత్తమ సేవలందించినందుకుగాను పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం అన్నవరం పిహెచ్‌సిలో ఆరోగ్య పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న కిమిడి రాణికి సేవారత్న స్టేట్ అవార్డు 2023 గానూ ఎంపిక చేసి సర్టిఫికెట్లు మెమొంటోను అందజేశారు. సెంట్ మదర్ తెరీసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు నేతృత్వంలో జిల్లా ఆరోగ్యశ్రీ కన్వీనర్ డాక్టర్ యు. అప్పలరాజు ద్వారా ఈ అవార్డును అందజేశారు.

ప్రతి వాదులకు నోటీసు

ఈ నోటీసు మూలకంగా మీయిరువురకు తెలియజేయునది ఏమనగా దివంగత మీ నాన్నగారు ఈ దావాకి వాదియైన **అత్తలూరి సునీత లక్ష్మి గారికి** మీ నాన్నగారు బాకీపడి వున్నందున, వారుకాలము చేసినందున మీరే ముఖ్య వారసులుయిందున మీపైన, మా తల్లిగారి పైన బాకీ వసూలు చేసి నిమిత్తము సాలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో **OS NO. 163/2021** న ఒక దావా దాఖలు చేసిను. మీయిరువురి యొక్క ప్రస్తుత అడ్రాసు తెలియనందున దావా యొక్క వాయిదాను పేపరు మూలకంగా తెలియజేసున్నాను. **వాయిదా తే 31-03-2023 దిన** కోర్టుకు మీరుహాజరయిన లేక మీ తరపున న్యాయవాది అయినా మీ యొక్క వాదనను వినిపించు కొనవచ్చును. లేని ఎడల మీకు వాదనలేదని బావించి మీపై డిక్రీ జారీ చేయబడను.

T. Jagannadha Rao
Advocate,
SALUR,PPM Manyom (Dist)
Cell: 8247804627, 8985391382.

నాడు -నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఆర్.వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ శనివారం పరిశీలించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ పనులను పూర్తి చేయాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను పరిశీలించి వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పాఠ్యాంశాలు, నోట్ బుక్స్‌లో చేసిన హెూమ్ వర్స్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూరిదేముడు, హెచ్‌ఎం భాస్కరరావు పాల్గొన్నారు.

సాలూరు పురపాలక సంఘం
షార్ట్ టెండర్ నోటీసు

ఆర్. సి. నెం.15/2023-ఇ1. తేది.25.03.2023

సాలూరు పురపాలక సంఘమునకు సంబంధించి పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో చేపట్టబోవు ఈ దిగువ చూపిన పనులకు **e-Procurement Portal** ద్వారా షార్ట్ టెండర్లను ఆహ్వానించడమైనది.

మొత్తం పనులు	5 Works (12th Call) 40 Works (2nd Call) 9 Works (4th Call) 23 Works (5th Call)
మొత్తం అంచనా విలువ	రూ. 265.46 లక్షలు
టెండర్ డాక్యుమెంట్లు అందుబాటు సమయం	తే. 27-03.2023 ది ఉదయం 11:00 గంటల నుండి
టెండర్లు స్వీకరించుటకు చివరి తేదీ మరియు సమయం	తే. 03-04.2023 ది మద్యాహ్నం 03:00 గంటల వరకు
టెండర్లు తెరచు సమయం	తే. 03-04.2023 ది మద్యాహ్నం 04:00 గంటలకు

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :1. కమీషనరు - 9849905794
2. డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు - 9849906989

ఇతర వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.

కమీషనర్,
సాలూరు పురపాలక సంఘం.